క్లుప్తంగా

కలకోవలో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మునగాల : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. కోదాడ డీఎస్పీ ప్రకాష్, మునగాల సీఐ పి.వీరరాఘవులు ఆధ్వర్యంలో నారాయణగూడెం, కలకోవ, నర్సింహులగూడెంలో ఐటీబీపీ బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ లోకేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంపై శిక్షణ



మాట్లాడుతున్న ట్రైనర్ కరుణాసాగర్

నడిగూడెం : గ్రామీణ నిరుద్యోగులకు ప్రభుత్వం ఇస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ట్రైనర్ కరుణాసాగర్ కోరారు. మండలంలోని సిరిపురంలో భవన నిర్మాణంపై వృత్తి నైపుణ్యంపై ఇవ్వనున్న 15 రోజుల ఉచిత శిక్షణను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు టీషర్టులు, క్యాప్‌లు, హెల్మెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు మేకల నాగరాజు, పాండు, గుండ్లపల్లి బుచ్చిరాములు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బందికి దుస్తులు పంపిణీ



దుస్తులు అందజేస్తున్న రావులపల్లి ప్రసాద్

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం రావులపల్లి ప్రసాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంతో పాటు ప్రతిరోజు పారిశుద్ధ్యం మెరుగుకు సేవలు అందిస్తున్నందుకు తనవంతుగా చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి జిలకర రామస్వామి, సత్యనారాయణరెడ్డి, బట్టు మధు, సీతారాంరెడ్డి, రాంమోహన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, శ్రీనివాస్‌రావు, సూర్యనారాయణరెడ్డి, తదితరులు ఉన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్.బి.అఖిల కోరారు. మండల కేంద్రంలోని పలువురు రైతులకు చెందిన గొర్రెలకు బుధవారం ఉచితంగా చీడపారుడు వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా 331 గొర్రెలు, 61 మేకలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


పేదల పార్టీ బీఎస్పీ



ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఎస్పీ అభ్యర్థి నవీన్‌కుమార్

పాలకవీడు : పేదలను ఓటు బ్యాంకుగా మలుచుకున్న గత ప్రభుత్వాలను ఓడించాలని, పేదల పార్టీ బీఎస్పీని గెలిపించాలని బీఎస్పీ హుజూర్‌నగర్ నియోజకవర్గ అభ్యర్థి రాపోలు నవీన్‌కుమార్ కోరారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. విద్య, ఉద్యోగాల కల్పన, వైద్యం, పేదలకు ఆరోగ్య బీమా అందించడమే లక్ష్యంగా బీఎస్పీ పనిచేస్తుందన్నారు. ఆయన వెంట పార్టీ నియోజకవర్గ నాయకులు రామస్వామి, గణేష్, నాగార్జున, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

నడిగూడెం : మండల కేంద్రంలోని సుందరయ్య భవన్ ఆవరణలో బుధవారం డీవైఎఫ్ఐ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కన్వీనర్ కాసాని కిషోర్ జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో డీవైఎఫ్ఐ 43 ఏళ్లుగా యువత సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేసిందన్నారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేశగాని భద్రయ్య, మండల అధ్యక్షుడు యల్లయ్య, నాయకులు అంజి, రాంబాబు, ఇందు, వేణు, దినేష్, మనోహర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు బీసీలు ఓటుతో బుద్ధిచెప్పాలి

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



కోదాడ : కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఉత్తమ్, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు

కోదాడ/కోదాడఅర్బన్ : బీసీ అని చెప్పుకుంటున్న కోదాడ ఎమ్మెల్యే బీసీలపైనే కేసులు పెట్టించాడని, బీసీ ప్రజాప్రతినిధులను ఇబ్బంది పెట్టాడని, వచ్చే ఎన్నికల్లో బీసీలు ఓటుతో ఆయనకు తగిన విధంగా బుద్ధి చెప్పాలని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. బుధవారం కోదాడ పట్టణంలో నాయీబ్రహ్మణ సంఘం సభ్యులు పలువురు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో బీసీ వర్గాలన్నీ కాంగ్రెస్ వైపు నిలవడం అభినందనీయమన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని నిర్ణయించుకున్నారని, కోదాడలో గెలుపు ఎప్పుడో నిర్ణయమైందని, మెజార్టీ మాత్రమే చూసుకోవాలని అన్నారు. పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపునిస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, పాండురంగారావు, అల్తాఫ్ హుస్సేన్, తాడేపల్లి గోవిందరావు, సీతారాములు, ఆలేటి సత్యనారాయణ మాధవరపు కృష్ణ, చిరంజీవి, అద్దంకి శ్రీనివాసరావు, గుడిమల్ల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీ స్కీమ్‌లపై ఇంటింటి ప్రచారం

మునగాల : మండల కేంద్రంలోని హరిజన కాలనీలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు ఉప్పల జానకిరెడ్డి, భీమపంగు శంకర్, కొమ్ము ఈదారావు, కుక్కడపు లక్ష్మయ్య, కాసర్ల వెంకట్, అంజయ్య, నాగరాజు, కోటేశ్వరరావు, బోస్, జాన్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

ఆకుపాముల, నర్సింహాపురం, కోదండరామాపురం గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి శ్రీనివాస్, సారెడ్డి నరేందర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ చెప్పే మాయమాటలు నమ్మవద్దు

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

కోదాడ : కోదాడ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ మరోసారి గెలువబోతుందని, రాష్ట్రంలో కేసీఆర్ మూడవసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం కోదాడలో బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ప్రజాప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ చెప్పే మాయమాటలు నమ్మవద్దని, గ్రామాలలో ప్రజలను చైతన్యం చేసి బీఆర్‌ఎస్‌కు ఓటు వేసే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులదేనని అన్నారు. కోదాడ నియోజకవర్గ ప్రజలకు తాను ఎప్పుడు సేవకుడిగానే ఉంటానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చింత కవిత, సుంకర అజయ్‌కుమార్, పల్లా నర్సిరెడ్డి, తొగరు రమేష్, కాసాని వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారం

కోదాడరూరల్ : కోదాడ మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం గురువారం నుంచి ప్రారంభం కానుందని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లం మల్లయ్య ఆధ్వర్యంలో నల్లబండగూడెం, మంగళితండా, చిమిర్యాల, దోరకుంట, అల్వాలపురం గ్రామాల్లో ఈ ప్రచార కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. మండలంలోని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన మాజీ గ్రంథాలయ చైర్మన్ పి.సంపత్‌కుమార్ బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత పదేళ్లుగా ప్రభుత్వం గ్రూప్– 1, తదితర పోటీ పరీక్షలు సక్రమంగా నిర్వహించనందుకు నిరసనగా రాజీనామా చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రాజీనామా పత్రాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడికి పంపినట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- మాజీ ఎమ్మెల్యే పద్మావతి



కోదాడరూరల్ : కొమరబండలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

కోదాడరూరల్ : కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూస్తుంటే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ మెజార్టీతో గెలిచి అధికారంలోకి రావడం ఖాయమైనట్లు కనిపిస్తుందని మాజీ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని కొమరబండలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ, ఆరు గ్యారంటీ పథకాలపై నిర్వహించిన ప్రచారంలో ఆమె మాట్లాడారు. తొమ్మిదిన్నర సంవత్సరాల బీఆర్‌ఎస్ అవినీతి పాలనపై ప్రజలు విసిగిపోయారన్నారు. యువత, నిరుద్యోగులు, మేధావులు సీఎం కేసీఆర్ మాయమాటలను నమ్మకుండా వారు చేసిన అవినీతిపై గ్రామాల్లో ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంపెట రవిగౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగవీటి రామారావు, కౌన్సిలర్ నెమ్మాది బాబు, ఎర్నేని బాబు, పార సీతయ్య, సంపెట సుధాకర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి మంగళితండా సర్పంచ్

మండలంలోని మంగళితండా సర్పంచ్ రమావత్ పద్మజబ్బార్‌తో పాటు ముగ్గురు వార్డు సభ్యులు మంగళవారం రాత్రి కోదాడలో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఉపసర్పంచ్ వాసు, వార్డు సభ్యులు సావిత్రి, నాగేశ్వరరావుతో పాటు 170 మంది ఉన్నారు.

బీజేపీ కోదాడ టికెట్ నాకే ఇవ్వాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఓర్సు వేళంగిరాజు

కోదాడఅర్బన్ : బీజేపీ కోదాడ అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ తనకే ఇవ్వాలని కోదాడకు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఓర్సు వేళంగిరాజు కోరారు. కోదాడ బీజేపీ టికెట్‌ను పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించాలని చర్చ జరుగుతుండడంతో బుధవారం కోదాడలోని తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోదాడ అసెంబ్లీ సీటును జనసేనకు కేటాయించొద్దని, పార్టీ బలోపేతానికి పనిచేసిన తనకే సీటు కేటాయించాలన్నారు. వడ్డెర కులానికి చెందిన తాను అసెంబ్లీలో అడుగుబెట్టి అధ్యక్షా అనే అవకాశం కల్పించాలని కోరారు. టికెట్ ఇవ్వని పక్షంలో అసెంబ్లీ ఎన్నికల బరిలో ఇండిపెంటెంట్‌గా నిలబడుతానని తెలిపారు. సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సేవ చేస్తున్నా.. గెలిపించండి



లక్కవరంలో ప్రచారం నిర్వహిస్తున్న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లుట్ల రఘు

హుజూర్‌నగర్‌రూరల్ : నియోజకవర్గంలో ప్రజా సేవ చేస్తున్న తనకు ఓటు వేసి గెలిపించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ హుజూర్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లుట్ల రఘు కోరారు. బుధవారం మండలంలోని లక్కవరం, అనుములగూడెం, శ్రీనివాసపురం, తదితర గ్రామాల్లో ఆయన ఆ పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓజో ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలో అనేక మందికి సహాయం అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై దాడి అప్రజాస్వామికం



నేరేడుచర్ల : సమావేశంలో మాట్లాడుతున్న కొణతం సత్యనారాయణరెడ్డి



గరిడేపల్లి : తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నేరేడుచర్ల : మెదక్ ఎంపీ, బీఆర్‌ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యయత్నానికి పాల్పడటం అప్రజాస్వామికంగా అని, ఓటమి భయంతోనే బీఆర్‌ఎస్ అభ్యర్థులపై దాడులకు పాల్పడుతున్నారని మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, ఎంపీపీ లకుమళ్ల జ్యోతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, పట్టణ అధ్యక్షుడు కొణతం సత్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం నేరేడుచర్లలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ తాళ్లూరి లక్ష్మీనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, పట్టణ ప్రధాన కార్యదర్శి చిత్తలూరి పెద్ద సైదులు, కౌన్సిలర్ తాళ్లూరి సాయి, సింగిల్ విండో చైర్మన్ శాఖమూరి శ్రీకాంత్, మత్స్య సహకార సంఘం చైర్మన్ వీరయ్య, ఎన్నికల ఇన్‌చార్జ్ మన్సూర్ అలీ, నాయకులు రమేష్‌బాబు, మల్లయ్య, రాములు, రాజేష్, శేఖర్ ఉన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

హుజూర్‌నగర్‌రూరల్ : మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి కోరారు. ఈమేరకు బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి అబ్దుల్ నభీ, సర్పంచ్‌లు కర్నాటి అంజిరెడ్డి, సైదేశ్వరరావు, సైదులు, జయమ్మ, ధనమూర్తి, సౌజన్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర్‌రెడ్డిపై దాడిని ఖండించాలి

గరిడేపల్లి : దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిని ఖండించాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్ కోరారు. దాడి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకటరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శంభిరెడ్డి, గందె వినోద, శ్రీహరి, చంద్రయ్య, గుర్వయ్య, వీరయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయంలో వినతి

హుజూర్‌నగర్ : హత్యా రాజకీయాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఈమేరకు గురువారం హుజూర్‌నగర్‌లో పట్టణ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయ అధికారి వినతిపత్రం అందజేశారు. మాజీ ఎంపీపీ ఎస్.వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ నాయకులు అమర్‌గౌడ్, పిచ్చయ్య, దొంతిరెడ్డి పద్మారాంరెడ్డి, ప్రదీప్‌గౌడ్, కౌన్సిలర్లు కేఎల్ఎన్‌రావు, మంగమ్మ వీరారెడ్డి, కొమ్ము శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



హుజూర్‌నగర్‌రూరల్ : పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : పట్టణంలో మంగళవారం జరిగిన సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేసిన ప్రజలకు ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు ఎవరూ ఊహించని విధంగా ప్రజలు హాజరుకావడంతో కొందరికి మాటలు రాని పరిస్థితి నెలకొందని అన్నారు. స్థానికుడైన సైదన్నను భారీ మెజార్టీతో గెలిపించాలనే ఆశతో ప్రజలు సభకు వచ్చారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సాగర్ కాలువకు నీరు ఇస్తామని, ఇండస్ట్రీయల్ పార్క్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పెట్టాలని అడిగితే, అన్ని ఇస్తామన్నాడని తెలిపారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. తొలుత పట్టణంలోని విష్ణ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు అబ్దుల్‌నబీ, గల్లా సైదులు, కీత ధనమూర్తి, ప్రదీప్, ఉపేందర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాసోజు శంకరమ్మ

బీఆర్‌ఎస్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కాసోజు శంకరమ్మ బుధవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శానంపూడి సైదిడడ్డిని కలిశారు. ఈసందర్భంగా పలు విషయాలపై చర్చించి విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాలేటి రామారావు, రామోజీ తదితరులు ఉన్నారు. అనంతరం టీఎస్‌డబ్ల్యూ హమాలీ యూనియన్ నాయకులు ఎమ్మెల్యే సైదిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని ఓడించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకువెళ్లాలంటే కాంగ్రెస్ పార్టీని ఓడించాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని వేపలసింగారంలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన 250 మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి, సారెడ్డి భాస్కర్‌రెడ్డి, కుందూరు శ్రీనివాసరెడ్డి, కడవెండి విజయలక్ష్మి, వెంకటచారి, సాయిరెడ్డి, శంభిరెడ్డి, వీరారెడ్డి, హుస్సేన్, రవి, సంజీవరెడ్డి, కాశమ్మ, బుజ్జి, వెంకటరెడ్డి ఉన్నారు.

3 నుంచి 10 వరకు నామినేషన్ల స్వీకరణ

- రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి

హుజూర్‌నగర్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నవంబర్ 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు హుజూర్‌నగర్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అన్ని పని దినాలలో నామినేషన్లు స్వీకరిస్తారని రిటర్నింగ్ అధికారి ఆర్డీఓ ఎస్.జగదీశ్వర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసారి నామినేషన్ల ఫారం – 26 అఫిడవిట్ నేరుగా దరఖాస్తు పూర్తి చేసి లేదా ఆన్‌లైన్ పద్ధతిలో కూడా చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో పూర్తి చేసిన నామినేషన్, ఫారం –26 అఫిడవిట్‌ను ప్రింట్ చేసి పోటీ చేయాలనుకున్న అభ్యర్థి గాని అతని ప్రతిపాదకుడు గాని రిటర్నింగ్ అధికారికి కార్యాలయంలో సమర్పించాలని ఆయన తెలిపారు. ఆన్‌లైన్‌లో నామినేషన్, ఫారం –26 అఫిడవిట్ దరఖాస్తు చేసుకోవడానికి భారత ఎన్నికల సంఘం వారి సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పోటీచేస్తున్న అభ్యర్థులు తమ డిపాజిట్ సొమ్మును అదే పోర్టల్‌లో చెల్లించవచ్చని, నామినేషన్ ఫారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ దాని కాపీని అభ్యర్థి సంతకంతో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఇచ్చినప్పుడే అది చెల్లుబాటు అవుతుందని ఆయన పేర్కొన్నారు.

పలువురికి డాక్టరేటు పట్టాలు ప్రదానం



పాలకవీడు : ఓయూ వీసీ, అడోబ్ సీఈఓ నుంచి డాక్టరేట్ పట్టా అందుకుంటున్న భూపాల్‌రెడ్డి



నడిగూడెం : డాక్టరేట్ పట్టా అందుకుంటున్న కొల్లు శ్రీనివాస్



మునగాల : డాక్టరేట్ పట్టా అందుకుంటున్న కత్తి సరస్వతి



హుజూర్‌నగర్ : డాక్టరేట్ పట్టా అందుకుంటున్న శ్రీనివాస్

పాలకవీడు : మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన నంద్యాల భూపాల్‌రెడ్డి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన 83 స్నాతకోత్సవ కార్యక్రమంలో వీసీ రవీంద్రకుమార్, అడోబ్ సీఈఓ శంతన్ నారాయణ్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ నిజాం కళాశాలలో పొలిటికల్ సైన్స్ పీజీ కోర్సు పూర్తి చేసిన అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ కె.తిరుపతిరెడ్డి పర్యవేక్షణలో ఎలక్టోరల్ ప్రాసెస్ ఇన్ ఇండియా ఏ కేస్ స్టడీ నల్లగొండ జిల్లా 1999 ఆంధ్రప్రదేశ్ లెజిస్లేచర్ అనే అంశంపై పరిశోధన చేసి ఆ గ్రంథాన్ని సమర్పించినందుకు గాను డాక్టరేట్ లభించినట్లు తెలిపారు. కాగా ఆయన 23 సంవత్సరాలుగా తెలుగు టీవీ రంగంలో సీనియర్ జర్నలిస్టుగా, ప్రస్తుతం టీ శాట్ నెట్‌వర్క్ ఛానల్ ప్రోగ్రాం ప్రొడ్యూసర్‌గా పని చేస్తున్నారు.

రేపాల వాసికి పీహెచ్‌డీ పట్టా

మునగాల : మండలంలోని రేపాల గ్రామానికి చెందిన కత్తి సరస్వతి రాజనీతి శాస్త్రంలో పీహెచ్‌డి పట్టా సాధించింది. మంగళవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన 83వ స్నాతకోత్సవంలో ఓయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డి.రవీందర్, అడోబ్ కంపెనీ సీఈఓ శ్రీశంతన్ నారాయణ్ చేతుల మీదుగా రాజనీతి శాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. కత్తి సరస్వతి ప్రస్తుతం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్నారు. సరస్వతి పీహెచ్‌డీ పట్టా పొందిన సందర్భంగా మాదిగ ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి డా.కత్తి వెంకటేశ్వర్లు, ఉద్యోగుల సంఘం నాయకులు కత్తి లింగయ్యతో పాటు మండలానికి చెందిన మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు అభినందించారు.

అధ్యాపకుడికి డాక్టరేట్

నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న కొల్లు శ్రీనివాస్ బుధవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 85వ స్నాతకోత్సవంలో ప్రముఖ బహుళ అడోబ్ సంస్థ సీఈఓ శంతన్ నారాయణన్ చేతుల మీదుగా డాక్టరేట్ అవార్డు పొందారు. శ్రీనివాస్ సూర్యాపేట, భువనగిరి మున్సిపాలిటీల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై పరిశోధనలు జరిపినందుకు గాను ఈ పురస్కారాన్ని ఆయనకి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను అధ్యాపకులు అభినందించారు.

మొలుగూరి శ్రీనివాస్‌కు పీహెచ్‌డీ పట్టా

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన మొలుగూరి శ్రీనివాస్ హిస్టరీ విభాగంలో పీహెచ్‌డీ పట్టాను పొందారు. ఏ బయోగ్రాఫికల్ స్టడీ ఆఫ్ కొండా లక్ష్మణ్ బాపూజీ అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు గాను హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో 83 స్నాతకోత్సవంలో అడోబ్ సీఈఓ శాంతన్ నారాయణ్ (యూఎస్ఏ), ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రవీందర్.. దండెబోయిన శ్రీనివాస్‌కు పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేశారు. ఈంసందర్భంగా పట్టణానికి చెందిన పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి



పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ జెడ్పీటీసీ ఉపేందర్‌రావు

మునగాల : బీఆర్‌ఎస్ కోదాడ నియోజకవర్గ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మాజీ జెడ్పీటీసీ కోల ఉపేందర్‌రావు కోరారు. బుధవారం మండలంలోని తాడువాయిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోట జానయ్య, కస్తాల వెంకటేశ్వర్లు, ముంజల వీరయ్యలు కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించి మాట్లాడారు. కార్యక్రమంలో తాడువాయి సర్పంచ్ లొడంగి సంజీవ, మాజీ సర్పంచ్ లక్యానాయక్, బీఆర్‌ఎస్ నాయకులు కోల అంజనేయులు, సొంపంగు గోపి, కోట అలీ, పాపయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయమే ధ్యేయంగా పనిచేయాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు శివారెడ్డి

మఠంపల్లి : కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విజయమే ధ్యేయంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి, హుజూర్‌నగర్ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ ఆదూరి స్రవంతికిషోర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో ఎంపీటీసీ ప్రభుదాసు, మాజీ జెడ్పీటీసీ అరుణాసైదులు, మాజీ ఉపసర్పంచ్ గాదె లూర్దుమరెడ్డి, నాయకులు శౌరీ, చిన్నపరెడ్డి, జయభారత్‌రెడ్డి, మహేష్‌గౌడ్, జార్జిరెడ్డి, గాలి చిన్నారెడ్డి, అంతోనిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రమజీవుల పక్షాన నిరంతర పోరాటం



సమావేశంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

హుజూర్‌నగర్ : నిర్మాణ రంగంలో పనిచేసే శ్రమజీవుల పక్షాన భవన నిర్మాణ కార్మిక (సీఐటీయూ) సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్యగౌడ్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని ఆ సంఘం కార్యాలయంలో సర్వసభ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రజలు, కార్మికులు, కర్షకలు కోరే రాజ్యం రావాలని అన్నారు. గాజాపై ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న మారణకాండను ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా కోశాధికారి చల్లా కృష్ణ, పట్టణ అధ్యక్షుడు శీలం వేణు, నాయకులు వెంకన్న, ముస్తఫా, వెంకన్న, రాంబాబు, రాములు, రామకృష్ణ, అంజయ్య, అశోక్, సాయి, సూర్యనారాయణ చారి, రాకేష్, మధు, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడికి నిరసన



నడిగూడెంలో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

నడిగూడెం : పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడి చేయడాన్ని నిరసిస్తూ బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ మాట్లాడుతూ సామ్రాజ్యవాదాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొరట్ల శ్రీనివాస్, ఏనుగుల వీరాంజనేయులు, లతీఫ్‌బాబు, అంజి, శ్రీను, చెన్నమ్మ, మంగమ్మ, వీరయ్య పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

గరిడేపల్లి : నర్సరీలను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ వనజ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని నర్సరీని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు నర్సరీ నిర్వహణను బాధ్యతగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సురేష్, టీఏ శిరీష, ఫీల్డ్ అసిస్టెంట్ మేకపోతుల సరిత, కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

కళాశాలల్లో ఏక్తా దివస్

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ మాతృదేశ సేవకు సంసిద్ధులై ఉండాలని ప్రియదర్శిని విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ పశ్య శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం ప్రియదర్శిని జూనియర్, డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ మట్టపల్లి రవీందర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పి.శిరీష, జక్కుల రమేష్, లక్ష్మణ్‌రాజు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.